'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

హైడ్రా విప్పిచెప్పిన 'ఫాంహౌస్' కథ!

ఎస్జీవీ శ్రీనివాస రావు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. కేసీఆర్ మీద ప్రతిపక్షాలు ఏమని ప్రచారాలు చేశాయి? ఏ సాకుతో బురద జల్లాయి? బాగా వినిపించిన మాట. ఫాంహౌస్. అవును.. ప్రతిపక్షాలు, పచ్చ లాబీ మేపే మేధావులు, పాత్రికేయులు, లెఫ్ట్, రైటు సిద్ధాంతకర్తలు, కుల గురువులు అందరికందరూ ఫాంహౌస్.. ఫాంహౌస్ అంటూ ప్రచారంతో ఊదరగొట్టారు. వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడమే తప్పు అన్నట్టుగా బీఆర్‌ఎస్ అధినేతపై ఈ మూకలన్నీ మైకులు బద్దలయ్యేదాకా దుష్ప్రచారం చేశాయి. ప్రజల మనసులో విషం నింపాయి. అయితే, కాలం ఒక్కలా ఉండదు. అది ఎదురుతన్నిన రోజు ఒకటి వస్తుంది... వచ్చింది! గ్యారెంటీలను అమలుచేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించడానికి హైడ్రా పేరుతో డ్రామా మొదలుపెట్టింది. అయితే, ఈ డైవర్షన్ డ్రామా అటు కాంగ్రెస్ పార్టీకి ఎదురుతన్నడంతో పాటు ఇటు బీఆర్‌ఎస్‌కు ఒక గొప్ప మేలు చేసింది. ఈ కూల్చివేతలు, నోటీసుల పర్వం వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల ఎందరెందరు కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎన్నెన్ని ఫాంహౌస్‌లున్నాయో తొలిసారి బయటపడింది. కోట్ల విలువ చేసే ఫాంహౌస్‌లు ఎంత విలాసవంతంగా కొలువుదీరాయో ఫొటోలు, వీడియోలతో సహా బయటపడ్డాయి. ఒక్కో నాయకుడు ప్రభుత్వ భూములు, చెరువులు ఎంత అడ్డంగా ఆక్రమించి మరీ వాటిని కట్టుకున్నారో కూడా ఆధారాలు, మ్యాప్‌లతో సహా వెల్లడైంది.

ఈ డ్రామా వ్యవహారానికి ముందు రాష్ట్రంలో ఒక్క కేసీఆర్‌కే ఫాంహౌస్ ఉందేమో అనే రీతిలో పచ్చ మీడియాగాళ్లు, వెట్టి సోషల్‌మీడియా గాళ్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశా రు. బీఆర్ ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లు 'కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాడు', 'కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉన్నారు' అంటూ అదేదో తప్పయినట్టు పచ్చ మీడియా, సోషల్ మీడియాలో పెయిడ్ రాతగాళ్లు ప్రచారాలు చేశారు. బీజేపీ అయితే కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని, పాలన పడకేసిందని చిత్తం వచ్చిన రీతిలో ప్రచారం చేసి అది నిజమేనని ప్రజలను కూడా నమ్మించింది. ఆ ప్రచారాన్ని ప్రజలూ నమ్మారు. కేసీఆర్‌కు మాత్రమే ఫాంహౌస్ ఉన్నదని విద్యావంతులూ భ్రమపడ్డారు. కానీ, ఇవాళ ఎందరు నాయకులకు ఎన్నెన్ని ఫాంహౌస్‌లున్నాయో బయటపడుతుంటే నోళ్లు వెళ్లబెడుతున్నారు. వాస్తవమేమంటే రాష్ట్రంలో అత్యధిక ఫాంహౌస్‌లు ఉన్నది కాంగ్రెస్ పార్టీ నాయకులకే. బీజేపీ అధికారంలోకి రాలేదు కాబట్టి దానికి ఆ చాన్స్ దొరకలేదు. అసలు ఫాంహౌస్ అనే కల్చర్‌ను తెచ్చింది కూడా కాంగ్రెస్ నాయకులే. వైఎస్ ఇడుపులపాయ రాష్ట్రంలోనే అతిపెద్ద ఫాంహౌస్. అయినా పచ్చమీడియా ఏనాడూ దాన్ని ఆ పేరుతో పిలవలేదు. కానీ, కేసీఆర్ దగ్గరికి వచ్చేసరికి ప్లేటు ఫిరాయించి ఫాంహౌస్ అంటూ ప్రచారాలు చేసింది. కేసీఆర్ మీద జరిగిన దుష్ప్రచారంలో ఫాంహౌస్ అనేదాన్ని ఒక ఆయుధంగా వాడుకున్నారు. ఆ సాదా సీదా ఇంటిని భూస్వాముల గడీలతో పోల్చి, కేసీఆర్ అక్కడ ఏదో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారా? అనేంతగా ప్రచారాలు చేసిన వాళ్లు ఉన్నారు. ఈ ప్రచారం గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఇబ్బందిగా మారింది కూడా.

బండారం బయటపడింది!

కానీ, తాజాగా హైడ్రా రంగప్రవేశంతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో ఢిల్లీ లీడర్ల నుంచి గల్లీ లెవల్ లీడర్ల దాక ఎవరెవరికి ఫామ్‌హౌస్‌లున్నాయో హైడ్రా నోటీసులతో తేటతెల్లమైంది. ఈ అంశం మీద ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. 'ఇంతకాలం కేసీఆర్ ఒక్కడికే ఫాంహౌస్ ఉందనుకున్నాం. కానీ, ఇంతమందికి, ఇన్ని ఫాంహౌస్‌లున్నాయా?' అని ప్రజలు ఆశ్చర్యచకితులవుతున్నారు. సోషల్ మీడియాలో ఈ ఫాంహౌస్‌ల విషయం హాట్‌టాపిక్ అయింది. గండిపేటలో ఫాంహౌస్‌లున్న నాయకులే గతంలో కేసీఆర్ ఫాంహౌస్ మీద చేసిన వ్యాఖ్యలను ఆ నాయకులకే గుర్తుచేస్తూ వారిని ఒక ఆట ఆడుకుంటున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు కూడా ఈ ఫాంహౌస్‌ల బండారం బయటపడటం పట్ల ఆనందం వ్యక్తంచేస్తున్నాయి. మొత్తమ్మీద కొన్ని విషయాలు ప్రజలకు తేటతెల్లమయ్యాయి. ఒకటి.. కేసీఆర్‌కే కాదు, దాదాపు అన్ని పార్టీల లీడర్లకూ రాజధానిలో ఫాంహౌస్‌లున్నాయి. రెండు, కేసీఆర్ ఫాంహౌస్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నది. అక్కడ ఆయన వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ నాయకుల ఫాంహౌస్‌లన్నీ దందాల కోసం కట్టుకున్నారు. మూడు, రాజధానిలో ఎందరు నాయకులకు ఫాంహౌస్‌లున్నాయో మీడియాకు బాగా తెలుసు. అయినా ఏనాడూ ఆ విషయాన్ని మీడియా పొరపాటున కూడా వెల్లడించలేదు. అంతా కలిసికట్టుగా ఒక కుట్రపూరిత ప్రచారం చేశారు.

కేసీఆర్ కొన్నారు, వీళ్లు ఆక్రమించారు!

ఫాంహౌస్‌ల మంచి చెడుల మీద జర్నలిస్టు వర్గాల్లో కూడా కొంత చర్చ జరుగుతున్నది. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రానికి కావలసిన భూమిని డబ్బులు చెల్లించి కొనుక్కున్నారు. ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకున్నది, గుంజుకున్నది లేదు. అందులో ప్రభుత్వ భూమి లేదు. అసైన్డ్ భూమి కూడా లేదు. అలాగే చెరువులు, కుంటలు లేవు. ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌ల వంటి సమస్యలు లేవు. అంతా పారదర్శకం. పైగా, తన వ్యవసాయ క్షేత్రం నుంచి భగీరథ పైపులు వేయడానికి స్వయంగా ఆయనే అనుమతించారు. అందుకోసం కొంత పంట కూడా తొలగించారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌లన్నీ దురాక్రమణలే. పైసా చెల్లించకుండా బరితెగించి జరిపిన అడ్డగోలు ఆక్రమణలు. ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, ఎఫ్‌టీఎల్ భూములు, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టకూడని నిషేధిత భూములు. చెరువు శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపి

అడ్డంగా కబ్జాలు పెట్టిన భూములు ఏవీ వదల్లేదు. అడిగేవాడు లేకపోవడంతో ఒక్క పైసా ఖర్చు లేకుండా జంట నగరాల ప్రజలకు మంచినీరందించే గండిపేటనే అడ్డగోలుగా చెరబట్టి కట్టుకున్న అక్రమ నిర్మాణాలు అందులో ఉన్నాయి. నాలా మార్గాలు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌ల పరిధిని ధ్వంసం చేసి మట్టిని నింపి కట్టుకున్న విలాస మందిరాలున్నాయి. పేరుకు ఫాంహౌస్ అయినా ఇందులో ఒక్కడూ వ్యవసాయం చేసినవాడు లేడు. ఇక్కడ జరిగిందంతా ప్రకృతి విధ్వంసం, పర్యావరణ విధ్వంసం, కాలుష్య సృష్టి.

ఎవరివి గడీలు?

కేసీఆర్ ఫామ్ హౌస్‌గా చెప్పున్నది కేవలం నివాస గృహం. సాదా సీదా ఇల్లు. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేని గ్రామీణ వాతావరణం తలపించే ఒక మామూలు నిర్మాణం. పచ్చని పంట చేల మధ్య ఒక సామాన్య రైతు నివసించడానికి అనువైన ఇల్లు. ఫాంహౌస్ అనే పేరుతో అదేదో అద్దాల భవనం అయినట్టు ప్రచారం చేశారు. అయినా, దాన్ని గడీ అంటూ కూడా కొందరు ప్రచారాలు చేశారు. అక్కడేదో జరగరానిది జరుగుతున్నట్టు.. అదో విలాసమందిరమా అన్నట్టు ప్రజలకు నూరిపోశారు. మరి గండిపేట పరిధిలోని ఫాంహౌస్‌ల మాటేమిటి? అవి కేవలం నివాసాలా? రాజ ప్రాసాదాలు తలపించే నిర్మాణాలు. కోట్లకు కోట్లు పోసి కట్టిన బహుళ అంతస్థుల అత్యాధునిక విలాస మందిరాలు. బలిసిన కోటీశ్వరులు వారాంతాల్లో సేద తీరడానికి ఎంజాయ్ చేయడానికి వచ్చే రిలాక్స్ రిసార్టులు. ఆయా ఫాంహౌస్‌ల ప్రాంగణంలో పార్కులు, పెద్ద పెద్ద హాళ్లు. అందులోనే బార్లు, రూఫ్‌టాప్‌లో గండిపేట దృశ్యాలు చూస్తూ ఎంజాయ్ చేసే విలాస మందిరాలు. చుట్టూ ఎవరి చూపు అందనంత ఎత్తులో కోట గోడల్లాంటి ప్రహరీలు, లోపలి దృశ్యాలేవీ కనిపించని స్థాయిలో పెద్ద పెద్ద గేట్లు. కాపలాకు కుప్పలు తెప్పలుగా బౌన్సర్లు. మరి ఎవరివి గడీలు?

అక్కడేం జరుగుతున్నది?

వాస్తవానికి ఆ ఫాంహౌస్ కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం. వ్యవసాయం చూసుకోవడానికే ఆయన అక్కడికి వెళ్లారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి వ్యవసాయం చూసుకుంటారు. రకరకాల పంటలు పండిస్తారు. వ్యవసాయంలో రకరకాల ప్రయోగాలు చేస్తారు. కొత్త కొత్త పద్ధతులు పాటిస్తారు. కొత్త పంటలు తాను పండించి, తన అనుభవాన్ని అక్కడికి వచ్చే వారితో పంచుకుంటారు. కేసీఆర్ ఫాంహౌస్ కేవలం వ్యవసాయం చేయడం కోసమే కట్టుకున్నది. అక్కడ ఆయనకు వేరే వ్యాపకం లేదు. మరి గండిపేట, తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు కట్టిన రాజప్రాసాదాల్లో ఏం జరుగుతోంది? దందాలు, సెటిల్‌మెంట్లు, మజాలకు నిలయాలుగా మారాయని పుకార్లు షికారు చేస్తున్నాయి. కేసీఆర్ స్వయంగా విలేకరులను పిలిచి తన వ్యవసాయక్షేత్రంలో అంగుళం అంగుళం వారికి చూపించారు. వ్యవసాయంలో తాను చేస్తున్న ప్రయోగాలను వారికి విడమరిచి చెప్పారు. మరి కాంగ్రెస్ నాయకులు ఏనాడన్నా తమ ఫాంహౌస్‌లలోకి విలేకరులను రానిచ్చారా? అక్కడ పరిస్థితిని చూడనిచ్చారా? అసలా వైపే ఎవరినీ రానివ్వకూడనంత రహస్యం దేనికి? కేసీఆర్ ఫాంహౌస్‌లో అంతా పారదర్శకం. తనను చూడటానికి వచ్చే నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, అధికారులకు స్వయంగా కేసీఆరే తన పాత ఓమ్ని కారులో వ్యవసాయ క్షేత్రమంతా తిప్పి చూపిస్తారు. ఎలాంటి దాపరికం లేదు. కానీ, కాంగ్రెస్ ఫాంహౌస్‌లన్నీ రహస్యాలే. అసలు ఆ ప్రాంతం వైపే ఎవరినీ రానివ్వరు, దందాగాళ్లను తప్ప. వాటికి బౌన్సర్లు నిరంతరం కాపలా కాస్తారు. ఆఖరికి మహిళా జర్నలిస్టులు కూడా వారి దాడికి గురైన సంఘటనలు ఇటీవల జరిగాయి కూడా.

ఎవరిది కాలుష్యం?

కేసీఆర్ ఫాంహౌస్ నుంచి ఎలాంటి వ్యర్థాలు బయటకు రావు. చుట్టూ వ్యవసాయ భూములే కాబట్టి వ్యర్థాల సమస్యే తలెత్తదు. కానీ, ఎఫ్‌టీఎల్ పరిధిలోని కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌ల మాటేమిటి? అందులోని వ్యర్థాలు ఎటు వెళ్తున్నాయి? ఆ వ్యర్థాలు ఏకంగా హైదరాబాద్ నగర ప్రజలు తాగే నీటినే కలుషితం చేస్తున్నాయి. కేసీఆర్ వ్యవసాయం చేసుకుంటున్నారు, పంటలు పండించుకుంటున్నారు. ఆ ఫాంహౌస్ దగ్గరలో 200 ఆవులతో గోశాల కూడా ఉంది. మరి ఈ కాంగ్రెస్ నాయకులు? ఆక్రమించిన ఫాంహౌస్‌లను లక్షల రూపాయల అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. గండిపేట ఏదో వీళ్ల అబ్బ సొత్తయినట్టు దాన్ని చెరబట్టి భవంతులు కట్టుకొని దాన్నీ వాణిజ్య అవసరాలకు వాడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వీళ్లెవరూ ఈ ఫాంహౌస్‌లలో వ్యవసాయం చేయడం లేదు. ఖరీదైన విందు సమావేశాలు, వినోద సమావేశాలు పెట్టుకుంటున్నారు. గమ్మత్తేమంటే చెరువులను కబ్జాలు పెట్టిన ఈ నాయకులే కేసీఆర్‌ది ఫాంహౌస్ పాలన అంటూ దుష్ప్రచారాలు చేశారు. ప్రజలను నమ్మించారు. పచ్చ మీడియా కూడా తప్పు దారి పట్టించింది. ప్రజలూ పొరపడ్డారు. ఏదో ఊహించుకొని ఏదో అభిప్రాయానికి వచ్చారు. ఏమైనా చివరికి నిజం బయటపడింది. అయితే, జరగవలసిన నష్టం జరిగిపోయింది. అందుకే, ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది చూడకుండా ప్రచారాలకు మోసపోతే పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. ఫాంహౌస్ ఉదంతమే దానికి ఉదాహరణ!

వరి గోస పడవడ్తిమి, భరోసా లేదాయే?

'నమ్మి నానవోస్తే.. పుచ్చి బుర్రైందట..', 'అన్నం పెట్టినోడికి సున్నం పెట్టుడంటే ఇదే..' అన్న సామెతలు మా వూరి చెర్వులోకి గంగ నీళ్లు వచ్చే లిఫ్టు కాల్వ కాడ ఇనవడ్తున్నయ్. అప్పుడే హైద్రావాద్ నుంచి ఆంధ్రానగర్ కట్టపొంటి వస్తున్న నేను వాళ్ల మాటలు విని ఆగిన. అటుదిక్కు చెట్టు కింద బర్లు మేపుకొంటున్న నీరడి పోశన్న, ఈర్నాల శంకరు, గోసమోళ్ల సంజీవు ఇట్ల నలుగురైదుగురు ముచ్చట పెడ్తున్నరు. 'పొద్దుగాళ్ల పొద్దుగాళ్ల ఏం ముచ్చట వెడ్తున్నరే' అని మందలించిన.

కొండ్లాడ సంతోష్

'నమస్తే సంతన్న.. ఇదేనా రాకడ' అంటూ పలుకరింపులైనయ్. 'ఇగ ఏమైందే అంతగానం వొర్రుతున్నర'ంటూ నేను అడుగంగనే.. పోశన్న అందుకున్నడు. 'గీ కొత్తగొచ్చిన సర్కారోళ్లు సన్న వడ్లు వెయ్యిండ్రి.. ఐదొందల బోనస్ ఇస్తమని చెప్పంగనే.. అప్పోసాప్పో జేసి అవే వడ్లు నాటితిమి.', 'ఇప్పుడేమైందే మరి' అంటే.. 'ఏం గావాలె.. నోట్లె మన్నువడుడు ఒక్కటే తక్కువైంది'.. అంటూ రంది వడవట్టె. 'గట్ల బాధవడకే పోశన్న ఏమైందో జర చెప్పరాదే..' అంటే అంతలోనే ఈర్నాల శంకరు అందుకొని 'మా బాధలు మీకేం తెలుసు. గా కాంగ్రెసోళ్లను నమ్మితే నట్టేట ముచ్చిండ్రు.. ఇంకేం గావాలె' అన్నడు. 'అరె.. మంచిగ జెప్పుండ్రే.. ఏం సమజైత లేదు' అని అడగగా.. 'పోయినేడాది ఎలక్షన్లగా చేతిగుర్తు రేవంతు మా రైతులకు ఎకురానికి రూ.7,500 పెట్టుబడి సాయంగా ఇస్తమన్నడు. ఓటేసి గెలిపించినం.. ఇప్పుడేమో సన్న వడ్లు నాటితిమి.. ఇంకో పది దినాలైతే పంట చేతికొచ్చే టైం అస్తుంది. ఇప్పటిదాకా పెట్టుబడికి దిక్కే లేకపాయె. ఇంకో ముచ్చట జెప్పాలె.. మొన్న నడిమిట్ల కురిసిన వర్షాలకు పంటలకు మాయదారి రోగమొకటి వచ్చింది. చుట్టుపక్కల ఊర్లల్ల వరి ఆకులన్నీ మాడిపోయినయ్. దానికి మందుకొట్టేందుకు మళ్లీ అప్పు చేయాల్సి వచ్చింది. పంటలకు ఎప్పుడూ చల్లే ఎరువులే కాకుండా ఈసారి పురుగు మందులతో పెట్టుబడి ఎక్కువైంది. అప్పట్లంటే కేసీఆర్ సారు.. వడ్ల నారు పోయంగనే ఠంఛనుగా పెట్టుబడి సాయంమిస్తుండె. నాటే యాళ్లకు ఫోన్లన్నీ టింగ్.. టింగ్ మంటూ మొత్తుకుంటుంటే.. నవ్వుకుంట వెళ్లి పైసలు తెచ్చుకొని పంటలు వేసుకునేవాళ్లం. ఇప్పుడేమో గిట్ల అయిపాయే.. ఎవుసం ఎట్ల జేసుడో ఏమో'.. అంటూ కండ్లల్లకెల్లి నీళ్లు తెచ్చుకోవట్టె. 'ఏం రంది వడకురా వస్తయిలే ఏటు వోతయి.. రాకపోతే మన కోసం కొట్లాడే కేసీఆర్ మన ఎన్కాల ఉండనే ఉండె. అస్తయి తీయ్'.. అంటూ సంజీవులు చెప్పిండు.

> **ఇంతల్నే పోశన్న అందుకొని.. 'మన కోసం ఏం అడుగుతడు.. అన్నం పెట్టినోడికి సున్నం పెట్టినోళ్లం.. ఇంక మన గురించి ఆలోచిస్తడా' అంటుండంగనే సంజీవులొచ్చి.. 'గాయన కూడా ఒక రైతేరా పోశిగా.. మన బాధలు ఎరుకనే.. ఎలక్షన్ల మనం ఏదో సోయి తప్పి ఆయనను దూరం జేసుకున్నం. కానీ, ఆయనెప్పుడూ మన రైతుల వెంటే ఉంటడు' అని చెప్పిండు.**

ఇంతల్నే శంకరు కలుగజేసుకొని 'ఏందో ఏమోనే.. మొన్నటిదాకా కౌలు రైతులకు, పట్టా రైతులకు భరోసా ఇస్తమని చెప్పిండ్రు. ఇప్పుడేమో మీరు.. మీరు చూసుకోండ్రి అంటూ అవుతల వడేందుకు చూస్తుండ్రు. నేను మొన్న టీవీల జూసిన గా మంత్రి ఒకాయన ఎవరో ఒకరికే రైతుభరోసా ఇస్తమని చెప్పిండు. ఇంకేంది మన మధ్యల లొల్లివెట్టాలని చూస్తుండ్రు'.. అంటూ గరమైండు. 'మన కాపులోన్లే సక్కంగ జేయలే.. ఇంక భరోసా ఏమి ఇచ్చేటట్టు ఉన్నడు గీ కొత్త సీఎం. ఇంక నిన్న మల్లొక వార్త చెప్పిండు.. సన్నవడ్లకు కింటాలుకు ఐదొందలు ఇస్తమని.. ఇగ మస్త యింది. గీయన మాటలు మనం నమ్మితే.. గంగల వడుడె. నాకైతే అస్తయన్న ఆశ కనవడ్తలేదు. ముందైతే గా భరోసా పైసలైతే ఇయ్యమను' అంటూ మళ్లీ అందుకున్నడు.

మధ్యలో ఒకాయన (కాంగ్రెస్ అభిమాని) వొచ్చి 'అవునే.. నిజమేనే.. మేం కూడా మోస పోయినమనిపిస్తున్నది. ఎలక్షన్ల గాయనను గెలిపించేతందుకు మస్తు జెప్పినం.. ఇప్పుడు ఊర్ల మాకే పతేరా లేకుంట పోయింది' అనుకుంటూ మెల్లిగా జారుకున్నడు. 'గంత మంచిగా టైంకు పెట్టుబడి సాయమిచ్చే.. యాళ్లకు వడ్లు కొని పైసలు అకౌంట్ల ఏసిండు. రైతులకు ఏ రందీ లేకుంట చూసుకోండ్రని ఎక్కడ వోయినా.. ఏ మీటింగ్ పెట్టినా ఆఫీసర్లకు.. మంత్రులకు మంచిగ చెబుతుండే.. దేవుడోలె మనల్ని మంచిగజూసుకున్న కేసీఆర్ సారును మనం దూరం జేసుకొని బాధల్ని నెత్తినపెట్టుకున్నం' అనుకుంట బాధపడ్డరు.

'నిజమేనే ఒక ఇషయం యాదికొచ్చింది. ఒకపారి.. దేశంల మిడతల దండు వచ్చి పంటల మీది వాలి మొత్తం నాశనం జేసింది గుర్తుకున్నదా మీకందరికి? గా టైంల కేసీఆర్ సారు సీఎంగా ఉండె. మనకు ఆ ముచ్చట తెల్వకముందే కేసీఆర్ సారు ఆఫీసర్లతో మాట్లాడి.. ఇటు దిక్కు ఆదిలాబాద్, బాసర, భైంసా, జుక్కల్, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్ల ఇట్ల తెలంగాణ సుట్టూ గా నీళ్ల మోటర్లు (ఫైరింజన్లు) పెట్టి రెడీగా ఉంచిండు. అప్పుడే అర్థమైందే.. మన కేసీఆర్ సారుకు ఎవుసం మీద.. మన రైతుల మీద ఎంత పీర్తి ఉన్నదో.. అగ్గో గట్ల ఉండాలె సీఎం అంటే.. ఎంతైనా కేసీఆర్.. కేసీఆరే..' అంటూ బర్లు కొట్టుకొని పోయిండ్రంతా.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

'రాజీ మాటకి మామూలే కానీ, చేతలకొచ్చేసరికి ఒక జీవితకాల యుద్ధమే దాగుంటుంది' అన్నది ఓ తత్త్వవేత్త చెప్పిన సూక్తి. ఈ సూక్తి అర్థవంతంగానే ఉంది కానీ, దాన్ని పాలకులు ఒంట బట్టించుకున్నట్లు లేరు. రాజీపడి జీవించడమంటే ఏదో పెద్ద యుద్ధం చేసినట్టుగా భావించటమే ప్రపంచంలో ఇప్పుడున్న అసలైన సమస్య.

యుద్ధం మిగిలే ఉంది!

డాక్టర్ మహ్మద్ హసన్
99080 59234

కళింగ యుద్ధం అశోకుడి జీవితాన్ని మార్చివేసింది. తర్వాత తన జీవితాంతం ఆయన మళ్లీ యుద్ధానికి పోలేదు. స్వయంగా తన కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్రను బౌద్ధ మత ప్రచారం కోసం దేశవిదేశాలకు పంపినట్టుగా చరిత్ర చెప్తున్నది. గొప్ప చరిత్రకు వేదికగా నిల్చింది నాటి కళింగ యుద్ధం. ఇలా చరిత్రలో జరిగిన యుద్ధాల గురించి చెప్పుకుంటూ పోతే గొప్ప గొప్ప చారిత్రక సందర్భాలను ఉటంకించాల్సి ఉంటుంది. యుద్ధం ద్వారా పాలకుడిలో కలిగిన పరివర్తనకు నిదర్శనం ఆ సంఘటన. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా పుట్టుకొచ్చిన పలు విప్లవాలు రాజరిక పాలనలకు తెరదించి ప్రజాస్వామ్య పాలనకు, జాతీయ రాజ్యాలకు బీజం వేశాయి. ఫలితంగా రాజులు, రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయారు.

స్వతంత్ర దేశాలు ఏర్పడినప్పటికీ దేశాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, భౌగోళిక, పాలనా, మతపరమైన వివాదాలు నేటికీ సద్దుమణగలేదు. కాగా తరచు ప్రపంచంలో ఏదో ఒక మూలన దేశాల మధ్య లేదా ప్రజలకు, పాలకులకు మధ్య యుద్ధం జరుగుతూనే ఉన్నది. ఉదాహరణకు 2001, సెప్టెంబర్ 11 నాటి సంఘటన ద్వారా ఏకంగా అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థను సమూలంగా అంతం చేయడానికి అమెరికా పూనుకున్న ది. ఫలితంగా జరిగిన పోరులో అమెరికా గెలిచిం దా? అల్ ఖైదా ఓడిందా? అన్నది పక్కనపెడితే అమెరికా దుశ్చర్య వల్ల అఫ్ఘాన్ నేటికీ రావణకాష్టంలా మండుతున్నది.

జీవరసాయన ఆయుధాలను తయారు చేస్తున్నారన్న నెపంతో యుద్ధ నేరాలకు సద్దాం హుస్సేన్‌ను బాధ్యుడిగా చేస్తూ అతడిని అమెరికా ఉరి తీయించింది. ఓ పాలకుడిని హత మార్చినంత మాత్రాన ప్రపంచమంతా శాంతి పవనాలు వీస్తాయని ఆశించటం అవివేకపు ఆలోచన. అలా అయితే జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలిని పాలన అంతమయ్యాక యావత్ ప్రపంచంలో ఎందుకు శాంతిసామరస్యాలు వెల్లివిరియలేదు? అదేవిధంగా ఐరాస స్థాపన తర్వాత ప్రపంచం శాంతియుత సమాజంగా ఎందుకు మారలేదు? నాటినుంచి నేటివరకు పలుదేశాల మధ్య జరిగిన యుద్ధాలను ఐరాస ఎందుకు నివారించలేకపోయింది?

> **గత రెండేండ్లుగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతూనే ఉంది. రెండు దేశాల్లోనూ ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తున్నది. గతేడాది అక్టోబర్ 7న ప్రారంభమైన హమాస్-ఇజ్రాయెల్ పోరు క్రమంగా పశ్చిమాసియా అంతటా విస్తరిస్తున్నది. ఇప్పటికే వేలమంది పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారు. వారంతా యుద్ధంతో సంబంధం లేనివారే.**

ఓ పక్క ఆయుధాలు విక్రయిస్తూ, మరో పక్క ప్రపంచ శాంతి అంటూ నీతి వాక్యాలు వల్లిస్తున్న దేశాలు, ప్రపంచంపై ఆధిపత్యం కోసం స్వార్థపు ఆలోచనలు చేస్తున్నన్ని రోజులు యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. అలాంటి దేశాలతో ప్రపంచానికి ఎప్పటికైనా ప్రమాదమే. యుద్ధం ఇంకా మిగిలే ఉంది. రాబందుల రెక్కల చప్పుడు మరుభూమిలో వినిపిస్తూనే ఉంది. ఈ రోజు పశ్చిమాసియా దేశాలు కావచ్చు, ఇంకో రోజు మరో దేశం కావచ్చు యుద్ధం కౌగిట్లో నలిగిపోవడానికి. బాధితులు మాత్రం ఎన్నితరాలైనా సామాన్యులే. యుద్ధం అనేది నీలో నీ కోసం నిన్ను మార్చుకోవడానికి జరగాలి. అప్పుడే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది.

(2024, అక్టోబర్ 7తో 'హమాస్-ఇజ్రాయెల్' యుద్ధానికి ఏడాది)

ఎటమటం

ఎవరింటికి పుటం పెడుతడో

గుంపు మేస్త్రీ ఎవరింటికి పుటం పెడుతడో తెల్వక జనం తెల్లార్లు జాగారం చేస్తున్నరు. వాళ్లకు పండుగ లేదు, పబ్బం లేదు. పెత్తరమాస నాడు గూడ అమ్మలక్కలు బతుకమ్మ పేరుకే పేర్చిండ్రు గనీ.. మది నిండా గుండెలవిసిపోయే బాధే నాయే. ఆ బాధను కైగడితే బతుకమ్మ పాటైంది.

'గుంపు మేస్త్రీ పాలన ఉయ్యాలో..
గుదిబండ తీరాయె ఉయ్యాలో..
పేదల బతుకుల్లో ఉయ్యాలో..
చీకటి నింపిండు ఉయ్యాలో
గూడు చెదిరిపాయె ఉయ్యాలో..
గుండెలు అవిసిపాయె ఉయ్యాలో..
కాంగ్రెస్ రేవంత్ ఉయ్యాలో..
కాలయముడైపాయె ఉయ్యాలో..'

బతుకమ్మ రాగంతోనైనా ఆ మేస్త్రీకి సుతి ముట్టి బతుకనిస్తాడో అంటున్నారు మహిళలు.

ఇక దసరా పండుగే!

ఆంధ్రా ప్రజలు ఎగిరి గంతేస్తున్నరట! ఎందుకో తెలుసా ఇన్నాళ్లు ఏపీలో నాణ్యమైన మందు దొరక్క మందుబాబులు ఉక్కిరి బిక్కిరైన విషయం తెలిసిందే కదా? అయితే ఎన్నికలకు ముందు 'నాణ్యమైన మందును మీకు అందుబాటులో తెస్తామ'ని మాటిచ్చిన చంద్రబాబు ఆ మాట నెరవేర్చుకున్నారని సంతోషపడుతున్నారట. దసరా సందర్భంగా ఏపీ అంతటా మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయట! ప్రస్తుతం 'జాబు రావాలంటే బాబు రావాలి' నినాదం కాస్తా 'మందు రావాలంటే చంద్రబాబు రావాలి' అనే నినాదంగా మారి ఏపీ మందుబాబుల నోట్లో నానుతున్నదట! ఇంకేం మందు బాబులకు ఇక దసరా పండుగే!



మక్కికి మక్కీ..

వాళ్లిద్దరిది గురుశిష్యుల బంధం. గురువుగారి రాజ్యాంగంలోని పుటకు ఈగ అతుక్కుంటే.. శిష్యుడు ఈగను కొట్టి పుటల పెట్టేదాక నిద్రపోడు. అదేమంటే..! అభివృద్ధిలో బాబు గారితో పోటీ అంటడు. ఆయన బుడమేరు బురద కడుక్కోవడానికి, బురద రాజకీయాల్లోకి తిరుపతి లడ్డూను లాగిండు. ఈనె రైతు రుణమాఫీ చేయలేక.. రైతులకు మొఖం చూపలేక మూసీ మురికి మొఖం నిండా రుద్దుకొని తిరుగుతున్నడు. ఆ దురద భరించలేక హైడ్రాతో గోక్కున్నడు. జనం గురువును సుప్రీంకోర్టుకు.. శిష్యున్ని హైకోర్టు ఈడ్సిండ్రు. గురువు స్థాయికి తగ్గట్టుగా ఆయనను సుప్రీంకోర్టు తలంటగా.. శిష్యుడు స్థాయికి తగ్గట్టుగా హైకోర్టు మొట్టికాయలు వేసిందని నెటిజన్లు జోకులు పేలుస్తున్నరు.



ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

బర్రెకు సగేసి దూడను ఎగేసినట్టుంది బీజేపీ సంగతి. అటు జనాన్ని ఎగేస్తోంది, ఇటు సర్కారుకు సగేస్తోంది. హైడ్రాకు సూపర్ పవర్స్ కల్పిస్తూ కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దాన్ని గవర్నర్ ఆమోదించారు. అయితే, కేంద్ర మంత్రులిద్దరు దగ్గర ఉండి మరీ ఆర్డినెన్స్‌కు ఆమోదింపజేశారట. పాపం బీజేపీతో రాహుల్‌గాంధీ కొట్లాడుతుంటే.. రాష్ట్రంలో బీజేపీతో కాంగ్రెస్ దోస్తీ కట్టడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

- చిన రాజయ్య